ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు


3★

సోమవారం 1 ఏప్రిల్ 2024

ఘనంగా పోచమ్మ బోనాలు

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

6లో..





ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం

ఖని జనరల్ ఆసుపత్రికి కొత్త వెలుగులు

- మెడికల్ హబ్‌గా రామగుండం
- శరవేగంగా క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు
- రూ.140కోట్లతో 355పడకల పడకల ఆసుపత్రి నిర్మాణం

కళ్యాణ్‌నగర్, మార్చి 31: మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన రామగుండం మెడికల్ హబ్‌గా మారనున్నది. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం, జెన్‌కో ప్రభుత్వరంగ సంస్థలతో పాటు వీటిపై పరోక్షంగా ఆధారపడి ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రల్లో పనిచేసే కార్మికులకు, రామగుండం నియోజకవర్గ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా సింగరేణి నిధులతో రామ గుండంలో నూతనంగా ఏర్పాటైన మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న గోదావరిఖని ప్రభు త్వ జనరల్ ఆసుపత్రికి కొత్త వెలుగులు వస్తున్నాయి. ఒకప్పుడు వంద పడకల ఆసుపత్రిగా ఉన్న గోదావ రిఖని ప్రభుత్వాసుపత్రిలో నామమాత్రపు సేవలే అందేవి. రెండు సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ రూ.510 కోట్లతో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రామగుండం మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కళాశాలకు అను బంధంగా 360బెడ్లు ప్రస్తుతం ఉం డగా, అదనంగా రూ.16.2కోట్లతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీడీఎంఎస్ ఆధ్వర్యంలో 50 పడకల సూపర్ క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఫిబ్రవరి 19న ప్రారంభించారు. ఏడాదిలోపు పనులు పూర్తికావాలనే లక్ష్యంతో శరవేగంగా పనులు మొదలయ్యాయి. ఐసీడీ ఎంఎస్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఈ భవన నిర్మాణ పనులను ఇంజనీర్లు చకచకా పూర్తి చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఐసీయూ కేంద్రంలో అన్నిరకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒకప్పుడు జిల్లాలోనే గైనిక్ సేవల్లో ముందున్న గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మెడికల్ కళాశాల వచ్చిన తరువాత వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

● రోజుకు వెయ్యి మందికి పైగా ఓపీ..

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన తరువాత రోగుల సంఖ్య పెరిగింది. కొమురంభీం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూరు, కోటపల్లి, మహాముత్తారం, మంథనితో పాటు ఛత్తీస్‌గఢ్, సిర్వొంచ నుంచి రోజుకు 1000 నుంచి 1200మంది వరకు ఔట్ పేషెంట్లు వైద్య చికిత్స కోసం వస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులోకి వచ్చారు. గుండెవ్యాధి నిపుణులు, న్యూరో వైద్య నిపుణులు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.6.5కోట్లతో రెండవ అంతస్థు భవనం నిర్మించగా అందులో 10 ఎడకల ఐసీయూ కేంద్రాన్ని, పిడియాట్రిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు జనరల్ వార్డులను ఏర్పాటు చేశారు. సైకాలజిస్ట్, పలమానాలజిస్ట్, యూరాలజిస్ట్ డాక్టర్లు కూడా అందుబాటులోకి రావడంతో నిత్యం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కిటకిటలాడుతోంది.

● 355 పడకల ఆసుపత్రి ఏర్పాటు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఖాళీ స్థలంలో అదనంగా 355పడకల ఐదు అంతస్థుల భవనానికి శ్రీకారం చుట్టారు. రామగుండం మెడి కల్ కళాశాలకు రూ.510కోట్లు కేటాయించగా ఇప్పటికి రూ.290కోట్లు కేటాయించారు. ఇందులో రూ.200 కోట్లతో నిర్మాణాలు, రూ.100 కోట్లతో ఫర్నీచర్ ఇతర సౌకర్యాలు కల్పించారు. మార్చి 13న రూ.140కోట్లతో ఆసుపత్రి ఆవరణలో ఐదు అంతస్థుల భవన నిర్మాణానికి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమర్జెన్సీ ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డు, ట్రైజ్, ఔట్ పేషెంట్, బ్లడ్ షాపింల్ కలెక్షన్, రెడియో డాయగ్నోస్టిక్, మొదటి అంతస్థులో ఔట్ పేషెంట్, అడ్మినిస్ట్రేషన్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యుసన్, రెండవ అంతస్థులో జనరల్ మెడిసిన్, రిస్పెటరీ మెడిసిన్, ఎంఐసీయూ, 3వ అంతస్థులు జనరల్ సర్జరీ, ఎంఐసీయూ, ఫోర్త్ ఫ్లోర్‌లో ఆర్థోపెడిక్, పోస్ట్ ఆపరేటివ్ ఆర్థో, పెయిడ్ రూమ్స్, సింగిల్, డబుల్ బెడ్‌రూమ్, 5వ అంతస్థులో పోస్టు ఆపరేటివ్, ఆర్ఐసీయూ, ఎస్ఐసీయూ, ఓటీలు, ప్రీ ఆపరేటివ్, పోస్టు ఆపరేటివ్ రికవరీ, స్టెప్‌డౌన్ ఐసీయూ, సెంట్రల్ ల్యాబ్‌తో పాటు క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే సిటీ స్కాన్ సేవలు కొనసాగుతుండగా మరో రెండు మూడు నెలల్లో ఎంఆర్ఐ స్కాన్ కూడా ఏర్పాటు చేయనున్నారు.



ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్(ఫైల్)

మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

- మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే



రామగుండంలో పని చేస్తున్న కార్మికులకు, ప్రజలు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాట్టు, రామగుండాన్ని ఒక మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. గతంలో ఏ చిన్న వ్యాధికైనా కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు పరుగులు తీసేవారు. కానీ అలా కాకుండా అన్ని వైద్య సేవలను ఇక్కడే ఏర్పాటు చేశాం. ఐదు అంతస్థుల భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మొత్తం 767 పడకలు అందుబాటులోకి వస్తాయి. అన్ని విభాగాల డిపార్ట్‌మెంట్లను అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే 265మంది నర్సింగ్ స్టాఫ్ తమ సేవలను కొనసాగిస్తున్నారు. దీనికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ కాలేజీ అంద ుబాటులోకి వస్తాయి. రామగుండాన్ని మెడికల్ హబ్‌గా ఏర్పాటు చేసి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యం.

● రామగుండానికి కొత్త కళ

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భ గనులు క్రమంగా మూతపడుతూ ఇక్కడి వ్యాపార కేంద్రాలు కార్మికులు లేక వెలవెల బోవడం, పదవీ విరమణ పొందిన తరువాత చాలామంది కార్మికులు స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో పదేళ్లుగా రామ గుండంలో జనసంచారం లేక వెలవెలబోతోంది. కార్మికుల పిల్లలు కూడా హైదరాబాద్, బెంగుళూరు, పూణె వంటి ప్రాంతా ల్లో స్థిరపడడం, 3లక్షల జనాభా కలిగి రామగుండం ప్రస్తుతం 2.2లక్షలకు పడిపోయింది. రామగుండం రీజియన్‌లోనే ఒకప్పుడు 24వేల మంది కార్మికులు పని చేసేవారు. క్రమంగా వారి సంఖ్య 6వేలకు పడిపోయింది. ఇక్కడ కొత్త వ్యాపారాలు కానీ, ఇతర ఏ ప్రభుత్వరంగ సంస్థలు కానీ రావడం లేదు. సింగరేణి సంస్థ రూ.510కోట్లతో మెడికల్ కళాశాలకు ఏర్పాటుకు ముందుకు రావడంతో రెండేళ్లుగా ఇక్కడ వ్యాపారాభివృద్ధి కృంగిపోతుంది.ఇప్పటికే మెడికల్ కళాశాలలో రెండవ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు చదువు తున్నారు. 4వ సంవత్సరం వరకు వీరి సంఖ్య 600వరకు పెరుగుతుంది. అంతేకాకుండా పీజీ డాక్టర్లు కూడా అందుబాటులోకి రానున్న నేపథ్యంలో రామ గుండానికి మెడికల్ కళాశాల ఊపిరి పోసినట్టు అయ్యింది.

మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఎన్నిక

- చైర్మన్‌గా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కన్వీనర్‌గా మేయర్ అనిల్‌కుమార్

- కుల సంఘాల సమావేశంలో తీర్మానం

కోల్‌సిటీటౌన్, మార్చి 31: రామగుండం కార్పొరేషన్ మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కన్వీనర్‌గా మేయర్ బంగి అనిల్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం గోదావరిఖని తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ ట్రస్ట్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, సింగరేణి ఎస్‌సీ, ఎస్‌టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా, సమతా సైనిక దళ్ సంఘం ప్రతినిధులు పాల్గొని ఏకగ్రీవ తీర్మానం చేశారు. బాబుజగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబాఫూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌లను కలిసి కోరామన్నారు. బీసీ సంఘాలు, అణగారిన వర్గాలు, ఇతర సంఘాలు కలిసి వచ్చి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బొంకూరి మధు, ఫులిమోహన్, షైన రాజేష్, కాంపెల్లి సతీష్, పెద్దెల్లి ప్రకాష్, చంద్రమౌళి, పోగుల రంగయ్య, బొందయ్య, సమ్మయ్య, తాజోద్దిన్‌బాబా, పంజా అశోక్, కొండ్ర వెంకటేష్, గంటయ్య, దేవీ ప్రసాద్, లింగయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

సుల్తానాబాద్, మార్చి 31: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామంలో ఉన్న కంకర క్రషర్‌లో గత ఇరవై సంవత్సరాలుగా సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న భైరి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి గట్టేపల్లిలలో ఒక శుభకార్యంలో పాల్గొని ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే సుద్దాల పెట్రోల్ బంకు సమీపంలో చెట్టుకు ఢీకొని పడిపోయి తీవ్ర గాయాలతో ఉన్న శ్రీనివాస్‌ను అటుగా వెళుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, నారాయణపూర్ ఎంపీటీసీ మండల రమేష్‌లు గుర్తించి తమ కారులో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా ఏర్పాట్లు చేయించారు. తీవ్ర గాయాలతో పరిస్థితి విషమంగా ఉన్న అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించే యత్నంలో మృతిచెందాడు. మృతుడు శ్రీనివాస్ ఓదెల మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. గట్టేపల్లి గ్రామంలో తన స్నేహితుడు రాజన్ పెళ్లి రిసెప్షన్ వేడుకలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మంథనిరూరల్, మార్చి 31: మండలంలోని విలోచవరం గ్రామంలో విద్యుదాఘాతంతో బోగిరి లక్ష్మి(44) ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన లక్ష్మి విలోచవరంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి వచ్చింది. ఇంట్లో ఉన్న ఇనుప కూలర్‌కు విద్యుత్ సరఫరా అయి అది తగిలి కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో చోరీ

సుల్తానాబాద్, మార్చి 31: సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయం ఆవరణలో ఉన్న అమ్మవారి దేవాలయంలో మరో సారి దొంగతనం జరిగింది. పది రోజుల క్రితం ఇదే ఆలయంలో దొంగ అమ్మవారి మెడలోని మంగళసూత్రం చోరీ చేశాడు. అయితే అర్ధరాత్రి చప్పుడు రావడంతో పక్కనున్న వారు ఫోన్ చేయడంతో పోలీసులు దొంగను పట్టుకుని అతని నుంచి మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం గుడి తీసేసరికి అమ్మవారి దేవాలయం తలుపులు తెరిచి ఉండడంతో చూస్తే దొంగతనం జరిగినట్లు గుర్తించారు. గుడికి ఎడమ పక్క తలుపు గడియకున్న తాళాన్ని కోసినా డోర్ రాకపోవడంతో కుడి పక్క సందులో దూరి రాడ్‌తో తాళం వచ్చేలా చేసి తలుపులు తీసుకుని అమ్మవారి మెడలో ఉన్న మంగళసూత్రం ఎత్తుకెళ్లారు.

డిసెంబరు 3 నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి

- ఎండి పంటలకు ఎకరానికి రూ. 25వేల పరిహారం చెల్లించాలి
- పెద్దపల్లిలో రైతు నిరసన దీక్ష ముగింపు సభలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 3 నుంచే రాష్ట్రంలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని, ఆరోజు నుంచే ప్రాజెక్టుల గేట్లు మూసివేసి పంటలను ఈ ప్రభుత్వం ఎండగొట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ చేపట్టిన 36 గంటల రైతు నిరసన దీక్ష ముగింపు సభకు నిరంజన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో పదేళ్లలో ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకుండా పంటలను కాపాడిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. సాగు, తాగునీటితో పాటు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, వివిధ పథకాలను అమలు చేసి దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపారన్నారు. ఈ ప్రభుత్వానికి రైతులపై శ్రద్ధ లేదని, ఎన్నికలకు ముందు యాసంగిలో రైతులకు రైతుబంధు కింద రూ.7,500 కోట్లు సిద్ధం చేస్తే, ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నాయకులు నిలిపివేయించారన్నారు. ఎన్నికలయ్యాక రైతుల నోట్లో మట్టి కొట్టి గుత్తేదార్లకు ఆ సొమ్మును చెల్లించారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి రైతులపై ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎండుతున్న పంటలను కాపాడకుండా సీఎం, మంత్రులు రాజకీయ క్రీడతో రాక్షసానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. పంటలను పరిశీలించకుండా రైతులకు ఎందుకు శిక్ష విధిస్తున్నారని, పంట పొలాలను ఎందుకు ఫణంగా పెడుతున్నారని ప్రశ్నించారు. ఏప్రిల్ 2 వరకు ఎస్సారెస్పీ నీళ్లిస్తామని చెబుతున్నారని, అంటే పంటలు ఎండిపోతే ఎండిపోని అనే నిర్లక్ష్యంతో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. సీఎం, మంత్రులు పంటలను పరిశీలించకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. మంత్రులు తమ శాఖల గురించి మాట్లాడకుండా ప్రతి ఒక్కరు సీఎం స్థాయిలో అన్ని శాఖల గురించి మాట్లాడతారని, పాలనలో గాంభీర్యం, పద్ధతి లేకుండా పోయిందన్నారు. తమ పాలనలో 11 సార్లు 72 వేల 815 కోట్ల డబ్బులను రైతు బంధు కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు 1.35 కోట్ల ఎకరాలు సాగైతే తెలంగాణ వచ్చాక 2.38 కోట్ల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. 68 లక్షల టన్నుల నుంచి 3 కోట్ల టన్నుల వరకు ధాన్యం ఉత్పత్తులు పెరిగాయన్నారు. తమ హయాంలో అన్నింటిని అమలుచేశామని, ఇవాళ అన్ని పెండింగులో ఉన్నాయన్నారు. డిసెంబరు 9 రాగానే తులం బంగారంతో కల్యాణలక్ష్మి ఇస్తామంటే ముహూర్తాలు లేకున్నా కొందరు పెళ్లిళ్లు చేసుకున్నారని, తులం బంగారం కాదు కదా కల్యాణలక్ష్మి కూడా రావడం లేదని విమర్శించారు. ఇప్పుడే ఇలా ఉంటే ప్రజలకు ఏ రకంగా స్వాంతన చేకూరుస్తారని ప్రశ్నించారు. నలుగురు నాయకులు పార్టీని వీడితే ఏమి కాదని, 137 ఏళ్ల కాంగ్రెస్‌కు, 70 ఏళ్ల సంఘ్ పరివార్ గల బీజేపీకి అభ్యర్థులే లేని పరిస్థితి ఉందని, వారికి మా పార్టీ అభ్యర్థులే కావాల్నా అని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమాన్ని మరిచి వారి దృష్టిని మరల్చాలని చూస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒకటి, రెండు పిల్లర్లకు పర్రెలు వస్తే లక్ష కోట్ల అవినీతి జరిగిందని బదనాం చేస్తారా అన్నారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన ప్రాజెక్టు కూడా కూలి పోయిందని, కడెం ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టులు దెబ్బతింటే మరమ్మతులు చేసుకోలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎండిన పంటలకు ఎకరానికి 25 వేల పరిహారం ఇవ్వాలని, అదనులో ఉన్న పంటలకు నీళ్ల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ యాసంగిలో పండే పంటలకు బోనస్ ఇవ్వాలని, రైతులు ఎదురుచూస్తున్నారని, ఇవ్వకుంటే నిలదీసేందుకు రైతులు కాచుకుని చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని వదిలేసే ప్రసక్తే లేదని, నిద్రపోనివ్వమని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనతో పది, ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జడ్పీ ఛైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్, డీసీసీబీ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్, పార్టీ నాయకులు పీటి స్వామి, రఘువీర్‌సింగ్, గోపు అయిలయ్య యాదవ్, ఓరుగంటి రమణారావు, మల్లేష్ యాదవ్, అనంత రెడ్డి, రవీందర్‌సింగ్, ఉప్పు రాజ్‌కుమార్, మార్కు లక్ష్మణ్, పెంట రాజేష్, దాసరి ఉష, ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, రమాదేవి, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదుల కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కోడిపుంజుల రాజన్న

అంతర్గాం, మార్చి 31: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు కొమ్ము కాస్తూ రైతులు, కార్మికవర్గానికి నష్టం చేసే చర్యలు చేపడుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కోడి పుంజుల రాజన్న అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దంపేట భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీల పేరుతో ముస్లింలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అవలంభించే ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ పేరుతో అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఈదునూరి నరేష్, కోడిపుంజుల జ్యోతి, ఐ కృష్ణ, చిలుక శంకర్, మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, ఆరుముళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో భక్తులు పూజలు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మార్చి 31 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కోరుకున్న కోర్కెలు తీర్చే మల్లన్న జాతరకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రదక్షిణలు నిర్వహిస్తూ కోడె మొక్కులను సమర్పించారు. అలాగే ఒగ్గు పూజారులతో మల్లన్న పట్నాలు వేసి బోనాలను సమర్పించారు. అనంతరం బంగారు, మదన్న పోచమ్మ ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా, ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాంస్కృతిక కళాకారులు యాక్షగాన కళారూపాలను ప్రదర్శిస్తూ భ్రమరాంబ మల్లికార్జునస్వామి జీవిత చరిత్రను వల్లించారు.

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన ముదిరాజ్ సంఘ నాయకులు

మంథని, మార్చి 31: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ముదిరాజు సంఘం నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. ఆదివారం హైదరాబాదులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మంథని మున్సిపల్ పరిధిలోని చెందిన బోయన్‌పేట ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు ఎన్నికైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మంథని టౌన్ అధ్యక్షుడు పోలు శివ, ముది రాజ్ మహాసభ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకులు గూండా రాజు, బయ్య లింగయ్య, నరేడ్ల కిరణ్, నడిపి రాజయ్య, అట్టెం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుగులపల్లిలో వైభవంగా నాగులమల్లన్న పట్నాలు

పెద్దపల్లి రూరల్, మార్చి 31 : మండలంలోని అందుగులపల్లి శ్రీనాగుల మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం పట్నాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనాగుల మల్లికార్జునస్వామి యాదవ సంఘం అధ్యక్షులు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో మహిళలు బోనాలు ఎత్తుకోని డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకోని మొక్కులు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై మొక్కులు చెల్లించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు బొక్కల సంతోష్, సిద్ధ గట్టయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. ఉత్సవాలక వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు పెగడ రాములు, కొమురయ్య, దాడి రమేష్, కోయ్యాడ మల్లయ్య, కోయ్యాడ కుమారస్వామి, కోయ్యాడ చందు, కారే రాజ్‌కుమార్, పొలవేన కుమార్, మల్లేష్ రాజయ్య, సది, శిలారపు మొండయ్య, మర్రి కుమార్, కోయ్యాడ అంజిబాబు, బాపు, యాదవ సంఘం పెద్ద మనుషులు పలువురు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ద్విచక్రవాహనం, ఆటో ఢీ: ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 31: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన హోటల్ నిర్వాహకుడు బోడ సురేష్ (40) ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లి నుంచి సిరిసిల్లకు వస్తుండగా వెనకనుంచి గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. దీంతో సురేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. 108 వాతిహనంలో సురేష్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అనుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య ఉమ, కుమారుడు శ్రీహర్షిత్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం, మార్చి 31, మండలంలోని చొక్కారావుపల్లి బిక్కవాగు నుంచి అనుమతులు లేకుండా మండలంలోని జంగపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మండల కేంద్రానికి చెందిన కవ్వంపల్లి చంద్రయ్య ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బోయినపల్లి, మార్చి 31: బోయినపల్లి పెట్రోల్ పంప్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. వివరాల ప్రకారం వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన భారతి (50), సమీపబంధువు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గంగాధర మండలం రంగారావుపల్లిలో జరిగిన శుభాకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. బంక్ సమీపాన ఆటోను ఢీకోట్టి కింద పడిపోయారు. ఈప్రమాదంలో భారతి అక్కడిక్కడే మృతిచెందగా శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, మార్చి 31: ముస్తాబాద్ మండల కేంద్రంలో ఓ మహిళా ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొర్రె లలిత (50) అనే మహిళ అనే మహిళా మానసిక సమస్యలతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. భర్త కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

చందుర్తి మార్చి 31 : చందుర్తి మండలం మల్యాల గ్రామ శివారులోని కోళ్ల ఫారం సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం రుద్రంగి మండలం మానాల చెందిన నాగరాజు అనే యువకుడితో పాటు మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి మానాలకు వెళుతుండగా మల్యాల గ్రామంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసు

గన్నేరువరం, మార్చి 31: మండలంలోని మాదాపూర్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన బీజేపీ నాయకులపై కేసు నమోదు అయింది. గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన బీజేపీ నాయకులు బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణా రెడ్డి, గంగాధర శ్రీకాంత్‌పై ఎఫ్ఎస్‌టి టీమ్ ఇంచార్జి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తల్లిపై కొడుకు హత్యాయత్నం

మంథని, మార్చి 31: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన తీగల శాంత పై ఆమె చిన్న కొడుకు అయిన హరీష్ మద్యానికి బానిసై ఆదివారం కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం సమయంలో తన తల్లిని డబ్బులు ఇవ్వమని తిట్టి, కొట్టడంతో అంతటితో ఆగకుండా తన తల్లిని చంపాలనే ఉద్దేశ్యంతో ఒక కత్తిని తీసుకొని ఆమె వీపు భాగంలో పొడిచినట్లు తెలిపారు. తన తల్లిపై హత్యాయత్నం చేసిన హరీష్ పై చర్య తీసుకోవాలని కూతురు తీగల మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్ల పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామావళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదే స్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

'నవోదయ'కు విద్యార్థుల ఎంపిక

జూలపల్లి, మార్చి 31 : మండల కేంద్రంలోని జూపిటర్ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పాశం కార్తీక, గన్ను వేణుగోపాల్‌రెడ్డి అనే విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు జూపిటర్ పాఠశాల కరస్పాండెంట్ అందె కుమారస్వామి తెలిపారు. ఇటీవల నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్ టెస్టులో ఇద్దరు విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటు హక్కుపై కళాకారుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 31: సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఇదిలాపూర్‌లో ఓటు హక్కు ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత, బేటీ బచావో బేటీ పడావో తదితర కార్యక్రమాలపై రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాబృందంసభ్యులు ఆటపాటల ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశంగౌడ్, రాజన్న, శ్రావణ్, రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

నేత్రదానం

కోల్‌సిటీటౌన్, మార్చి 31: గోదావరిఖని తిరుమలనగర్‌కు చెందిన ఆర్ల రాజం(67) సింగరేణి రిటైర్డ్ కార్మికుడు శనివారం రాత్రి మృతిచెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు ముందుకువచ్చారు. కాంగ్రెస్ నాయకుడు గట్ల రమేష్ మృతుని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా స్పందించిన రాజం భార్య నరసమ్మ, కుటుంబసభ్యులు సతీష్, సువర్ణ, స్వరూప, స్రవంతి ముందుకువచ్చి దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి రాజమౌళి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరీఫ్ ద్వారా మృతిని నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, అభిషేకాలు



హోమం చేస్తున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 31: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి గణపతి సుబ్రహ్మణ్యేశ్వర, సీతారామచంద్ర, లక్ష్మి, నాగేంద్ర స్వామి నవగ్రహ పార్వతి పరమేశ్వర దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రెండవ రోజు భక్తులు సామూహిక హోమ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమంచేశారు. సాయంత్రం కుంకుమ పూజ తదితర పూజా కార్యక్రమాలు గ్రామ పురోహితుడు నిట్టూరి సతీష్‌శర్మతో పాటు వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, మాజీ సర్పంచులు తుల మనోహర్‌రావు, గోనె శ్యామ్, ముద్దసాని స్వరూపరాజయ్య, కోమల మల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు దొమ్మటి రవి, జంగా ప్రభాకర్ రెడ్డి, ముద్దసాని సమ్మయ్య, దొమ్మటి భాస్కర్, గాదర్ల వెంకటేష్, అలుగువెల్లి సంపత్‌రెడ్డి, సంఘని శ్రీనివాస్, ముద్దసాని రాజేశం, బొల్లోజుల రవీందర్, గాదర్ల రవి, అట్టపెల్లి నరేష్, గాజర్ల రాకేష్, బుర్ర హరీష్, పోగుల గణేష్, ముస్కు శివ, దొమ్మటి రాకేష్, కోమాల అరవింద్, గాజుల రాజు, కట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

మంథని, మార్చి 31: ఈస్టర్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సీయోను ప్రార్థన మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. యేసు క్రీస్తు పునరుత్థానం గురించి పాస్టర్ పెండ్రు ప్రసన్న కుమార్ వాఖ్యోపదేశం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ వల్లూరి ప్రభాకర్, దూడ మహేష్, అంకరి కుమార్, ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా జనరల్ సెక్రెటరీ అంకరి కుమార్, మంథని ప్రసాద్, అందే రమేష్, దాసరి సదానందం, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, ఈర్ల సదానందం, రామగిరి కుమార్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీ సీజ్

మంథని, మార్చి 31:మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామశివారులో వాహనాల తనిఖీలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి కూచ్‌రాజ్‌పల్లి గ్రామ శివారులో ఒక లారీని ఆపి తనిఖీలు చేయగా లారీ డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసక రవాణా చేస్తున్నాడన్నారు. కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన సయ్యద్ ముజాహిద్ డ్రైవర్, ఓనర్ ఎండీ గోరిమియాలు మంథని శివారులోని డంప్‌యార్డు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక లారీలో లోడ్ చేసుకొని వెళతుండగా పట్టుకున్నామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 31: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచేలా రాష్ట్ర ముఖ్య మంత్రి చొరవ తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఆదివారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో సీఎంకే లేఖ పేరిట కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉల్లి మొగిలి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు కలిసినట్టు తెలిపారు. ఈసందర్భంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు, కోల్ ఇండియా వేతనాల అమలు, జీఓ 22 గెజిట్ చేయడంవంటి అంశాలపై గత ప్రభుత్వ హయాంలో చేసిన పోరాటాలు, విజ్ఞప్తులను తెలియజేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా సంస్థ లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లింపు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సమగ్రమైన వివరాలతో వినతిపత్రాన్ని అందజేసినట్టు ఉల్లి మొగిలి తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్టు తెలిపారు. మూడు నెలలు గడిచినా కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తీరలేదని, వేతనాలు పెరగలేదని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యపై నిర్లక్షం చూపుతున్నట్టు ఉల్లి మొగిలి పేర్కొన్నారు. నేరుగా ముఖ్య మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సీఐటీయూ పూర్తి సమాచారంతో సీఎంకు వినతిపత్రాన్ని అందించనున్నదని తెలిపారు. సంబంధిత వినతిపత్రాన్ని కరపత్రాల రూపంలో సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులకు అందజేయనున్నట్టు తెలిపారు. జీవో 22ను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని, కోల్ ఇండియా వేతనాలు అమలు చేయాలని ప్రధాన డిమాండ్ అని, దాన్ని సాధించే వరకు విశ్రమించబోమని ఉల్లి మొగిలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏ భూమయ్య, రాజేష్, లక్ష్మణ్, నాగరాజు, మల్లేష్, రవితో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ గుడి వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పిల్లిపల్లెలో బోనాలతో మహిళలు

కళ్యాణ్‌నగర్, మార్చి 31: ఉగాది పర్వదినం సందర్భంగా పది రోజుల ముందు నుంచే పోచమ్మ బోనాలతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం గోదావరిఖని చౌరస్తాలోని ప్రధాన పోచమ్మ ఆలయం, బాపూజీనగర్, ఐబీ కాలనీ, విఠల్‌నగర్, తిలక్‌నగర్, పవర్‌హౌస్‌కాలనీ, ఇందిరానగర్, గంగానగర్‌లోని పోచమ్మ ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే మొక్కులు చెల్లించారు. మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని డప్పు చప్పులతో ఆలయాలకు చేరుకుని పోచమ్మకు పండ్లు, బెల్లం బోనంతో మొక్కులు అప్పగించారు. పోచమ్మకు పెద్ద ఎత్తున మేకలను, కోళ్లను బలి ఇచ్చారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని పిల్లిపల్లె గ్రామంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పోచమ్మ బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో స్థానిక మార్కెట్ నుంచి పుర వీధుల గుండా వెళ్లి పోచమ్మ ఆలయాల్లో బోనాలను సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని మంచరామి గ్రామంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ బోనాలు ఉత్సవాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అంతకుముందు పోచమ్మ ఆలయంలో పోతరాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కూడా నిర్వహించారు. రిటైర్డు అడిషనల్ ఎస్పీ ఉప్పు తిరుపతి, ఉప్పు సంపత్, ఫర్టిలైజర్ శ్రీనివాస్‌గౌడ్, పల్లెర్ల లింగయ్య, వీర లక్ష్మన్, పూరెళ్ల సత్తయ్య ఆశాడపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలంలోని పుట్నూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి ప్రత్యేక పూజల్లో భాగంగా మొదటి రోజు పోచమ్మకు బోనాలు తీశారు. డప్పుచప్పుల్లతో మహిళలు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జూలపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



సుల్తానాబాద్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

జూలపల్లి, మార్చి 31. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు పూర్వ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవనపెల్లి రమణమూర్తి, రాంచంద్రం, ర్యాకం నర్సింగం, నూతి మల్లయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మేకల రాజమొగిలి, కోడూరి మహేష్, కొంజర్ల శ్రీనివాస్, సిలువేరు మహేష్, దేవసాని అంజనేయులు, అమరగాని మల్లేశం, దారవేని పోచాలు, పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డి, గౌడ తిరుపతి, పెసరి స్వామి, ఉపాధ్యాయులు రఘురాంరెడ్డి, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, దశరథరెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో 2000-2002 ఇంటర్‌మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. సుల్తానాబాద్ విజ్ఞాన్ జూనియర కళాశాలలో 24 ఏళ్ల క్రితం ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి తమ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి కాలేజీ ప్రిన్సిపాల్ చీదురు మోహన్‌తో పాటు బాలసాని శ్రీనివాస్, పసెడ్ల శ్రీనివాస్, వేణుమాధవ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖనిలో కారు బీభత్సం

కోల్‌సిటీ, మార్చి 31: గోదావరిఖని పట్టణంలో ఆదివారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. మంచిర్యాలకు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుకుంటూ చౌరస్తా నుంచి బస్టాండ్ వైపు వెళతుండగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి బైక్ వస్తున్న ఓ వ్యక్తిని వీరబ్రహ్మేంద స్వామి ఆలయం వద్ద ఢీకొట్టి బైక్‌ను కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ వరకు తీసుకెళ్లాడు. అదృష్టవశాత్తు బైక్‌పై ఉన్న వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న జనం చూసి కారును ఆపారు. కారులో మద్యం సీసతో పాటు గంజాయి లభించినట్టు తెలుస్తోంది. వన్‌టౌన్ పోలీసులు కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



బీభత్సం సృష్టించిన కారు

వేములవాడలో ముగిసిన శివ కల్యాణోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీస్వామివారికి అవబృధ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 31 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీశివ కల్యాణోత్సవాలలో చివరి రోజు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమా శంకర్ నేతృత్వంలో అర్చకులు శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన తదుపరి పరివార దేవతార్చనలు, అభిషేకములు, పారాయణ ములు గావించారు. శ్రీస్వామివారి కళ్యాణ మండపంలో ఔపాసనము, బలిహరణము, శేషహోమం, జయాదులు గావించారు. తదుపరి యాగశాలలో ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం దేవతోద్వాసనము, నాకబలి, పుష్పయాగం, క్షేత్రపాలక బలి నిర్వహించారు. శ్రీస్వామివారి త్రిశూలయాత్ర నిర్వహించి ధర్మగుండంలో అవబృధ స్నానం గావించారు. రాత్రి ఏకాదశావరణములు ఏకాంత సేవతో ఐదు రోజుల శివకళ్యాణ ఉత్సవాలు ముగిశాయి.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రం ఆదివారం నాడు భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని శ్రీస్వామివారిని దర్శించుకుని తరించారు. శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. శివకళ్యాణ ఉత్సవాల సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశా రు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో క్రిక్కిరిసిపోయింది.

భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



శ్రీస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అవిశ్వాసానికి రంగం సిద్ధం

పాలకుర్తి, మార్చి 31: పాలకుర్తి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వ్యాళ్ల అనసూర్యపై అవిశ్వాసానికి రంగం సిద్దం అయ్యింది. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. కాగా కుక్కలగూడూర్ ఎంపిటీసి శ్రీపతి శంకరయ్య, రాణాపూర్ ఎంపీటీసీ మునిగాల సృజనలు ఎన్నికల ఖర్చుల వివరాలు సకాలంలో అందించలేదని వారి ఎన్నికను తిరష్కరించారు. మిగిలిన 9 మంది ఎంపీటీసీల్లో పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్ గౌడ్, కొత్తపల్లి ఎంపీటీసీసీ సంతపురి ప్రియాంక, ఈసాలతక్కళ్లపల్లి ఎంపీటీసీసీ ఎర్రం స్వామి, పాలకుర్తి ఎంపీటీసీసీ దుర్గం కుమార్, ఎల్కలపల్లి ఎంపీటీసీసీ పాలడుగు సతీష్‌లు వ్యాల్ల అనసూర్యపై తిరుగు బావుటా ఎగురవేస్తూ అవిశ్వాసానికి తెరలేపి పెద్దపల్లి ఆర్డీవోకు సంతకాలతో కూడిన పత్రాన్ని అందించారు.

ఈ మేరకు సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పొల్సాని శశికళ తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా వేంకటేశ్వరుడి ఏకాంతోత్సవం

ధర్మపురి, మార్చి 31: ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామివారల ఏకాంతోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించి సప్తావరణ పూజలు జరిపారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదిక వద్దకు తీసుకువెళ్లి పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యా నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచార్య, రమణాచారి, నరసింహమూర్తి, అర్చకులు కిరణ్, వంశీకృష్ణ, విజయ్, అరుణ్, నవీన్, మోహన్ తదితరులు అర్ధరాత్రి వరకు కార్యక్ర మాన్ని నిర్వహిం చారు. శ్రీ కొత్త నరసింహ స్వామి వారల పుష్ప యాగం కార్యక్ర మాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామివారల పల్లకి సేవ ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపల్లి రూరల్, మార్చి 31: పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండారి స్రవంతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నదని, ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో ఛైర్మన్‌లు హజరు కావాలని పేర్కోన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఓదెల, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన గట్టు స్వామిగౌడ్ ఆదివారం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. ఓదెల మండలం కొమిర శివారులో తాటిచెట్టు ఎక్కి కిందికి దిగుతున్న సమయంలో మోకు జారి పోవడంతో ప్రమాదం జరిగింది. చెట్టుపై నుంచి పడటం వల్ల పక్కటెముకలు విరిగాయని, పొట్టలో బలమైన గాయాలయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి గురైన బాధితుడికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గౌడ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కమాన్‌పూర్, మార్చి 31: మండలంలోని గుండారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కమాన్‌పూర్, మార్చి31: మండల కేంద్రానికి చెందిన కొత్తగాండ్ల వెంకటేష్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి ఆదివారం కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు సహాయం చేశారు. మృతుడి తల్లి అమృతకు 50 కేజీల బియ్యం, కొంత నగదును అందజేశారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, సభ్యులు లయన్ కోలేటి మారుతి, లయన్ ఇనగంటి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు జబ్బర్‌ఖాన్, బండ సాయి, శంకర్, వెంకటేష్‌లు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ముత్తారం, మార్చి 31: ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 5న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు కన్వీనర్ అత్తె చంద్రమౌళి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ కుమారస్వామి, రాజయ్యలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడికి సత్కారం



రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న కల్చరల్ అకాడమి ప్రతినిధులు

సుల్తానాబాద్, మార్చి 31: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ రాజ్‌కుమార్‌ను వై-వేములవాడ చారిటబుల్ ట్రస్ట్, అంబోదర కల్చరల్ అకాడమీ వారు సత్కరించారు. ఆదివారం వేములవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో తనకు సత్కారంతో పాటు నంది అవార్డు, ప్రశంసాపత్రం అందించారని రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్‌లో తాను చేపట్టిన అన్నదానం వంటి సేవా కార్యక్రమాలకు అవార్డు అందించారని వివరించారు. అవార్డు అందించిన వారికి, తన సేవలకు సహకరించిన దాతలకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

7న పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్, మార్చి 31: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న పోచమ్మ తల్లి బోనాలు నిర్వహిస్తున్నట్లు మున్నూరుకాపు సంఘం నాయకులు గాజుల రాజమల్లు, బిరుదు క్రిష్ణ, ముత్యాలు తదితరులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన కాపు సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ ఏటా పోచమ్మ బోనాలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని వార్డులలో ఉన్న కాపు కుటుంబాలు బోనాలతో పాత జెండా చౌరస్తా వద్దకు తరలి రావాలన్నారు. ప్రతీ వార్డుకు బోనాల వెంట డప్పులు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పాత జెండా చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున బోనాలతో పోచమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఆకతాయిల ఆట కట్టించిన షీటీమ్
-13మందిపై కేసు నమోదు

కోల్‌సిటీ, మార్చి31: విద్యార్థినిలను వేధిస్తున్న ఆకతాయిల ఆట కట్టించింది షీటీమ్స్. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థినిలను వేధిస్తున్న 22మంది ఆకతాయిలను షీటీమ్ ఏఎస్ఐ మల్లారెడ్డి ఆధ్వర్యంలో డెకాయిట్ ఆపరేషన్‌ను నిర్వహించి పట్టుకున్నారు. అందులో 13మందిపై కేసులు నమోదు చేయగా, 9మంది మైనర్లకు వారి కుటుంబ సభ్యులకు పిలిపించి కౌనస్సిలింగ్ నిర్వహించి మరోసారి వేధింపులకు గురి చేస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. వారి వద్ద నుంచి పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా విద్యార్థులను వేధింపులకు గురి చేస్తే షీటీమ్ నెం.6303923700కు కానీ, 100నంబర్‌కు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేష్ ఉన్నారు.

జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడికి సన్మానం



నర్సయ్యను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

పెద్దపల్లి టౌన్, మార్చి 31: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొలిపాక నర్సయ్యను ఆదివారం పెద్దపల్లి ముదిరాజ్ కులస్తులు పట్టణంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొలిపాక నర్సయ్యతో పాటు అతని కుమారుడు పెద్దపల్లి మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్‌ను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొలిపాక నరసయ్య మాట్లాడుతూ పట్టణంలోని మత్స్య పారిశ్రామిక కార్మికులు ముదిరాజు కులస్తులు తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, పట్టణ ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.